Digital, tmedia.net.in

# టీ-మీడియా

tmedia.net.in

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక :336
పేజీలు : 5

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

గురువారం 27/08/2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ


## మంత్రి వాకిటి శ్రీహరికి అస్వస్థత



⏭ మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ కు

**టిమీడియా, ఆగస్టు 26,నారాయణపేట:** తెలంగాణ పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, క్రీడలు, యువజన సర్వీసుల శాఖల మంత్రి వాకిటి శ్రీహరి అస్వస్థతకు గురయ్యారు. మక్తల్లోని తన నివాసంలో వైద్యుల ఆయనకు ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్య కోసం మంత్రి వాకిటి హైదరాబాద్ కు బయలుదేరారు. వాకిటి శ్రీహరి ఆరోగ్యంపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉన్నాయి. బుధవారం ఉదయం వ ం క ్ ల ్ నియోజకవర్గంమాగనూర్ మండల కాంగ్రెస్ గ్రామస్థాయి ముఖ్య నేతలు, సర్పంచులు, కార్యకర్తల సమావేశం మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ పథకాల అమలు, పార్టీ సంస్థాగత బలోపేతం, ఇప్పటి వరకు పూర్తి అయిన పనులు, పెండింగ్ లో ఉన్న పనులు, గ్రామాల్లో ఇంకా చేయాల్సిన పనులపై గ్రామాలవారీగా నేతలను నుంచి మంత్రి వాకిటి శ్రీహరి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# మోహన్ భగవత్ న్యూయార్క్ పర్యటనపై

## వ్యతిరేకంగా పలు పౌర, మత సంస్థల నిరసన



⏭ న్యూయార్క్ మేయర్ కామెంట్స్ చర్చ

**టీ మీడియా, ఆగస్టు 26, ఢిల్లీ బ్యూరో :** ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అమెరికా పర్యటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల గ్లోబల్ అవుట్‌రీచ్ కార్యక్రమంలో భాగంగా ఆయన అమెరికాకు విచ్చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా న్యూయార్క్‌లోని 'మ్యాడిసన్ స్క్వేర్ గార్డెన్' వేదికగా ప్రవాసులతో ఆగస్టు 29న భారీ సభను నిర్వహించనున్నారు. ఆ కార్యక్రమంలో ఆయన కీలక ప్రసంగం చేయనున్నారు. అయితే ఈ కార్యక్రమంపై న్యూయార్క్ నగర మేయర్ జోహ్రాన్ మామ్దానీ చేసిన కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి. మంగళవారం(అమెరికా కాలామానం ప్రకారం) జరిగిన విలేకరుల సమావేశంలో న్యూయార్క్ నగర మేయర్ మామ్దానీని జర్నలిస్టులు ఆర్ఎస్ఎస్ ఈవెంట్, దానిపై వస్తున్న నిరసనల గురించి ప్రశ్నించారు. ఈ సభను రద్దు చేసే అవకాశం ఉందా? అని మీడియా అడిగిన ప్రశ్నకు మామ్దానీ స్పందించారు. 'నేను ఈ కార్యక్రమాన్ని సమర్థించను. అయితే, ఇది ఒక ప్రైవేట్ ఈవెంట్. దీన్ని రద్దు చేసే అధికార పరిధి న్యూయార్క్ నగర ప్రభుత్వానికి ఉందో లేదో నాకు స్పష్టత లేదు' అని పేర్కొన్నారు.

శతాబ్ది వేడుకులను పురస్కరించుకుని ఆర్ఎస్ఎస్ ప్రపంచ వ్యాప్తంగా గ్లోబల్ అవుట్‌రీచ్ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగానే సంఘ్ చీఫ్ మోహన్ భగవత్ అమెరికా, కెనడా, బ్రిటన్ తదితర దేశాల్లో పర్యటిస్తున్నారు. తన పర్యటనలో భాగంగా ఆయన న్యూయార్క్‌కు చేరుకున్నారు. అక్కడ జరిగే ప్రత్యేక 'యూనివర్సల్ వన్నెస్' కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. మ్యాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో జరిగే ఈ భారీ సభకు సుమారు 5,000 మందికి పైగా ప్రవాస భారతీయులు హాజరయ్యే అవకాశం ఉన్నట్లు నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.

భారతీయ మూలాలున్న న్యూయార్క్ మేయర్ తన కుటుంబ నేపథ్యాన్ని కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు. 'మన నగర చరిత్రలో తొలి భారతీయ- అమెరికన్ మేయర్‌గా నేను ఇక్కడ ఉన్నాను. నా తల్లి కుటుంబం మొత్తం ఇప్పటికీ భారతదేశంలోనే ఉంది' అని చెప్పారు. భారత్ చాలా గొప్ప దేశమని, అది లౌకిక గణతంత్ర రాజ్యమని, అన్ని వర్గాల ప్రజలను సమానంగా ఆదరించే బహుళ సంస్కృతిగల సమాజమని తన తన కుటుంబం తనకు నేర్పినట్లు పేర్కొన్నారు. అయితే, ఏ దేశంలోనైనా ప్రజల మధ్య విభజన తెవడం, కొన్ని వర్గాలను పక్కన పెట్టే సిద్ధాంతాలు పెరుగుతుండటం తనను తీవ్రంగా కలచివేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మతం, కులం, వర్ణం, ప్రాంతం అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ గౌరవంగా బతకాలనే నగరానికి మేయర్‌గా, ఒక భారతీయ-అమెరికన్‌గా తాను అలాంటి విభజన తెచ్చే సిద్ధాంతాలను, కార్యక్రమాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. (మిగతా 2లో)

# నేపాల్‌లో వరద బీభత్సం



⏭ 46మంది మృతి

⏭ 105 మంది భారతీయులు గల్లంతు!

**టీ మీడియా, ఆగస్టు 26, ఢిల్లీ బ్యూరో :** నేపాల్‌లో ఆకస్మిక వరదలు పెను విధ్వంసాన్ని సృష్టించాయి. టిబెట్ సరిహద్దుల్లో ఉద్భవించిన ఈ మెరుపు వరదల్లో చిక్కుకుని ఇప్పటివరకు 95 మంది ప్రాణాలు కోల్పోగా, సుమారు 500 మంది గల్లంతయ్యారు. గల్లంతైన వారిలో 105 మంది భారతీయులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. రసువా, ధాడింగ్, నువాకోట్ జిల్లాల్లో వరద తీవ్రతకు వంతెనలు, రహదారులు, డజనుకు పైగా జలవిద్యుత్ ప్రాజెక్టులు ధ్వంసమయ్యాయి. బాధితుల సహాయార్థం భారత రాయబార కార్యాలయం అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లను అందుబాటులోకి తెచ్చింది. నేపాల్ సైన్యం హెలికాప్టర్లతో సహాయక చర్యలను ముమ్మరం చేసింది.

బుధవారం ఉదయం 9 గంటల సమయంలో నేపాల్-టిబెట్ సరిహద్దుల్లోని భోటేకోశీ నదికి ఒక్కసారిగా భారీ వరద పోటెత్తింది. టిబెట్-రసువాగఢి సరిహద్దుకు 20 కిలోమీటర్ల దూరంలో కొండచరియలు విరిగిపడటంతోనే ఈ విపత్తు సంభవించినట్లు ప్రాథమిక నివేదికలు, శాటిలైట్ చిత్రాల ద్వారా అధికారులు గుర్తించారు. లెంధే నది ఉప్పొంగి ఆ వరద నీరు భోటేకోశీ మీదుగా త్రిశూలి నదిలోకి ప్రవేశించడంతో రసువా, ధాడింగ్, నువాకోట్, చిత్వాన్ జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. వివిధ జిల్లాల్లో కలిపి మొత్తం 31 మంది మరణించినట్లు నేపాల్ అధికారులు ధ్రువీకరించారు.

**400 మంది గల్లంతు**

ఈ ఆకస్మిక వరదల్లో సుమారు 400 మంది ప్రయాణికులు గల్లంతు కాగా, అందులో 105 మంది భారతీయులు, 37 మంది ఎన్నారైలు ఉన్నారు. గల్లంతైన భారతీయుల్లో కనీసం 59 మంది కైలాస మానససరోవర్ యాత్రకు వెళ్తున్న వారని సామ్రాట్ టూర్స్ అండ్ ట్రావెల్ ఏజెన్సీ తెలిపింది. అలాగే 44 మంది నేపాల్ ఆర్మీ సిబ్బందితో సహా మొత్తం 80 మంది భద్రతా సిబ్బంది కూడా గల్లంతయ్యారు. గల్లంతైన వారి కోసం నేపాల్ ఆర్మీ రంగంలోకి దిగింది. హెలికాప్టర్లు, విపత్తు నిర్వహణ బృందాలను ప్రభావిత ప్రాంతాలకు తరలించి ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని హెచ్చరికలు జారీ చేశారు

**దెబ్బతిన్న జలవిద్యుత్ ప్రాజెక్టులు**

వరద ఉధృతికి 42 కిలోమీటర్ల మేర రహదారి కొట్టుకుపోవడంతో పాటు, 13 జలవిద్యుత్ ప్రాజెక్టులు తీవ్రంగా (మిగతా 2లో)

## అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం..



⏭ ముగ్గురు తెలంగాణ యువకుల దుర్మరణం

**టి మీడియా, ఆగస్టు 26, హైదరాబాద్ బ్యూరో :** అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన ముగ్గురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. ఫ్లోరిడాలోని బ్రెవార్డ్ కౌంటీలో ఇంటర్‌స్టేట్-95 (×95)పైఈప్రమాదంచోటుచేసుకుంది. ఫ్లోరిడా హైవే పెట్రోల్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం (ఆగస్టు 25) ఉదయం 10 గంటలకు కొద్దిసేపటి ముందు పామ్ బే ప్రాంతంలోని 172వ మైలురాయి వద్ద ప్రమాదం జరిగింది .వేగంగా ప్రయాణిస్తున్న ఓ వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి చెట్టును ఢీకొట్టినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఢీకొన్న తీవ్రతకు వాహనం మంటల్లో చిక్కుకున్నట్లు ట్రూపర్లు వెల్లడించారు. ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్న ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతి చెందినట్లు అధికారులు నిర్ధారించారు. మృతుల గుర్తింపు వివరాలు తొలుత వెల్లడించలేదు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది.అయితే మృతుల్లో ఒకరిని నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం నారాయణపూర్ (నాడాపూర్)కు చెందిన రాహుల్ ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. హరిబాబు, నాగమణి దంపతుల కుమారుడైన రాహుల్ ఉన్నత చదువుల కోసం కేవలం మూడు నెలల క్రితమే అమెరికా వెళ్లినట్లు సమాచారం. అమెరికాలో చదువుకుంటూ భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రాహుల్ ఇలా రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబంలో విషాదం నెలకొంది.ప్రమాదంలో మృతి చెందిన మరో ఇద్దరు యువకులు కూడా తెలంగాణకు చెందిన వారిగా సమాచారం. అయితే వారి పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. రాహుల్ మృతితో నారాయణపూర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు, మృతదేహాల తరలింపు తదితర అంశాలపై అధికారులు, కుటుంబ సభ్యులు సమాచారం కోసం ఎదురుచూస్తున్నారు.

# నేపాల్ ప్రధాని బాలెన్ షాతో మాట్లాడిన మోదీ

⏭ మానవతాసాయం చేస్తామని హామీ

**టీ మీడియా, ఆగస్టు 26, ఢిల్లీ బ్యూరో :** పొరుగుదేశం నేపాల్‌లో భారీ వరదలు బీభత్సం సృష్టించాయి. టిబెట్ సరిహద్దుకు సమీపంలోని ప్రాంతాల్లో బుధవారం ఉదయం ఒక్కసారిగా వరద ఉధృతి పెరగడంతో భారీ నష్టం సంభవించింది. నదీ పరివాహక ప్రాంతాల్లోని గ్రామాలు నీట మునిగాయి. కీలక మౌలిక వసతులు దెబ్బతిన్నాయి. పలు జలవిద్యుత్ ప్రాజెక్టులు వరద ప్రభావానికి గురయ్యాయి. ఈ క్రమంలోనే ప్రధాని నరేంద్ర మోదీ నేపాల్ ప్రధాని బాలేంద్ర షాతో ఫోన్‌లో మాట్లాడారు. అవసరమైన అన్ని సహాయసహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు.

**నేపాల్ ప్రధానికి మోదీ ఫోన్**

భారీ వరదల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ నేపాల్ ప్రధాని బాలేంద్ర షాతో ఫోన్‌లో మాట్లాడారు. వరదల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి సానుభూతి తెలిపారు. ఈ కష్టకాలంలో నేపాల్ ప్రజలకు భారతీయులంతా అండగా ఉంటారని మోదీ హామీ ఇచ్చారు. నేపాల్‌కు అవసరమైన అన్ని రకాల మానవతా సాయం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. సహాయక చర్యలు, సహాయ బృందాల సమన్వయంపై ఇరు దేశాల బృందాలు సన్నిహితంగా పనిచేస్తున్నాయని తెలిపారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు.

**నేపాల్‌కు భారత్ సహాయం**

వరద బాధిత నేపాల్‌కు భారత్ అత్యవసర సాయాన్ని పంపేందుకు సిద్ధమైంది. భారత వాయుసేన విమానాల ద్వారా మందులు,



ఆహార పదార్థాలు, ఇతర నిత్యావసర సామగ్రిని తరలించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ మానవతా సహాయం, విపత్తు సహాయక చర్యల లో భాగంగా ఈ సామగ్రిని పంపుతున్నారు. పరిస్థితిని బట్టి జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం సిబ్బందిని కూడా నేపాల్‌కు పంపే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. విపత్తు ప్రభావిత ప్రాంతాల్లో గాలింపు, రక్షణ, సహాయక చర్యలను వేగవంతం చేసేందుకు ఎన్?డీఆర్?ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు.

**భారత్-నేపాల్ సరిహద్దులో అప్రమత్తత**

భారీ వరదల నేపథ్యంలో భారత్ కూడా అప్రమత్తమైంది. భారత్-నేపాల్ మధ్య ఉన్న 1,751 కిలోమీటర్ల అంతర్జాతీయ సరిహద్దు వెంబడి సశస్త్ర సీమా బల్ (ఎస్?ఎస్?బీ) తన అన్ని విభాగాలను అప్రమత్తం చేసింది. సహాయ, రక్షణ చర్యల కోసం మొత్తం 18 బృందాలను మోహరించినట్లు అధికారులు తెలిపారు. వీటిలో ఏడు బృందాలను అత్యవసర పరిస్థితుల్లో రంగంలోకి దించేందుకు సిద్ధంగా ఉంచారు. కోషి, నారాయణి నదీ పరివాహక ప్రాంతాల్లో నీటి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందన్న వాతావరణ అంచనాల నేపథ్యంలో ఎస్?ఎస్?బీ అప్రమత్తంగా ఉంది. నేపాల్‌లోని చిన్న నదుల్లోనూ ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. భారత్‌లోనూ ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని ఘఘ్రా/కర్ణాలి, మహాకాళీ నదీ వ్యవస్థలకు ఆనుకుని ఉన్న సున్నిత ప్రాంతాలపై నిఘా పెంచారు. వరద పరిస్థితులు, నీటి ప్రవాహాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

**గల్లంతైన వారిలో భారతీయులు**

భారీ వరదల తర్వాత నేపాల్‌లో దాదాపు 400 మంది గల్లంతైనట్లు అధికారులు తెలిపారు. వీరిలో 105 మంది భారతీయులు, 37 మంది ఎన్ఆర్ఐలు ఉన్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా టిబెట్ సరిహద్దుకు ఆనుకుని ఉన్న రసువా జిల్లాలో వరదల ప్రభావం తీవ్రంగా ఉంది. గ్రామాలు, రహదారులు, ఇతర కీలక మౌలిక వసతులు దెబ్బతినడంతో సహాయక చర్యలకు సవాళ్లు ఎదురవుతున్నాయి. గల్లంతైన వారి కోసం అధికారులు గాలింపు, సహాయక చర్యలను ముమ్మరం చేశారు.

**స్పందించిన కాంగ్రెస్**

ఇదిలా ఉండగా, నేపాల్? వరదల వల్ల జరిగిన ప్రాణనష్టం, విధ్వంసపై కాంగ్రెస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. పొరుగు దేశానికి సాధ్యమైనంత మానవతా సహాయాన్ని అందించాలని కేంద్రాన్ని కోరారు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కోరారు. వరదల్లో గల్లంతైన భారతీయులను గుర్తించి, వారి కుటుంబాలకు సహాయం అందించాలని చెప్పారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు.

## మోహన్ భగవత్ న్యూయార్క్ పర్యటనపై

(మొదటి పేజీ తరువాయి)

**సివిల్ సొసైటీ సంస్థల నిరసనలు**

మోహన్ భగవత్ మ్యాడిసన్ స్క్వేర్ కార్యక్రమంలో పాల్గొనడాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలు మొదలయ్యాయి. న్యూయార్క్ నగర ప్రభుత్వ ప్రధాన కార్యాలయమైన సిటీ హాల్ వెలుపల పలు మతపరమైన, పౌర హక్కుల సంస్థలు నిరసన చేపట్టాయి. 'హిందూస్ ఫర్ హ్యూమన్ రైట్స్', 'ఇండియన్ అమెరికన్ ముస్లిం కౌన్సిల్', 'ఇంటర్‌ఫైత్ సెంటర్ ఆఫ్ న్యూయార్క్' వంటి ప్రముఖ సంస్థలు సంయుక్తంగా ఒక ప్రెస్‌మీట్ నిర్వహించాయి. ఆర్ఎస్ఎస్ భావజాలం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని, మ్యాడిసన్ స్క్వేర్ గార్డెన్ యాజమాన్యం ఈ కార్యక్రమానికి అనుమతి రద్దు చేయాలని ఆయా పౌర సంస్థలు డిమాండ్ చేశాయి. దీంతో భగవత్ పర్యటన, మాడిసన్ స్క్వేర్ గార్డెన్ కార్యక్రమం న్యూయార్క్‌లో చర్చనీయాంశంగా మారింది.

ఈ వివాదంపై మోహన్ భగవత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న 'అహెడ్ ఫోరమ్' సోషల్ మీడియా వేదికగా స్పందించింది. మోహన్ భగవత్ హాజరుకానున్న 'యూనివర్సల్ వన్నెస్' వేడుక అత్యంత పవిత్రమైన ఉద్దేశంతో ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఈ ప్రపంచం ఒకే కుటుంబం అనే సందేశాన్ని ఈ కార్యక్రమం చాటుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

# నేపాల్‌లో వరద బీభత్సం

(మొదటి పేజీ తరువాయి)

దెబ్బతిన్నాయి. పరిస్థితిని సమీక్షించిన నేపాల్ ప్రధాని బాలేంద్ర షా అత్యవసర సహాయక చర్యలకు ఆదేశించారు. నేపాల్ సైన్యం 12 హెలికాప్టర్లు, డ్రోన్లు, స్నిఫర్ డాగ్స్‌తో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టి సుమారు 80 మందిని రక్షించింది. నదికి అడ్డుపడిన ప్రదేశంలో నీరు ఇంకా పూర్తిగా బయటకు వెళ్లకపోవడంతో భోటేకోశీ, త్రిశూలి నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

**స్తంభించిన రాకపోకలు**

భారీ వరద ప్రవాహంలో అనేక వాహనాలు, స్థానిక కస్టమ్స్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న విలువైన సరుకులు కొట్టుకుపోయాయి. ఇటీవల కొత్తగా నిర్మించిన ఒక వంతెన సైతం వరద ఉధృతికి కొట్టుకుపోయినట్లు రసువా కస్టమ్స్ అధికారులు వెల్లడించారు. వరద ధాటికి నేపాల్ విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా ప్రభావితమైంది. ఆరు ప్రధాన విద్యుత్ కేంద్రాలు, ట్రాన్స్‌మిషన్ లైన్లు దెబ్బతిన్నాయి. నేపాల్‌లోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడిందని నేపాల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ ప్రకటించింది. పలు కీలక రహదారులు కొట్టుకుపోవడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి.

**అత్యవసర సమావేశం**

విపత్తు తీవ్రత దృష్ట్యా నేపాల్ ప్రధాని బాలేంద్ర షా జాతీయ విపత్తు నిర్వహణ సంస్థతో అత్యవసర సమావేశం నిర్వహించారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని, మెడికల్ బృందాలు, స్కౌట్స్, రెడ్‌క్రాస్ సంస్థలతో సమన్వయం చేసుకుంటూ బాధితులకు తక్షణ సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. సహాయం కోసం నేపాల్ పర్యాటక బోర్డు టోల్ ఫ్రీ నంబర్ 1234 లేదా హాట్‌లైన్ 1144 లేదా పర్యటక పోలీసుల నంబర్ 9851289445ను కూడా జారీ చేసింది.

**భారత్ హెల్ప్‌లైన్**

నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయం కూడా o977 985 131 6807, o977 970 910 7500 హెల్ప్‌లైన్ నంబర్లను జారీ చేసింది. మరోవైపు నేపాల్‌కు సరిహద్దులో ఉన్న బిహార్, ఉత్తర్‌ప్రదేశ్‌కు కేంద్రం అడ్వైజరీలు జారీ చేసింది. గండక్ నది పరివాహక ప్రాంతంలో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిస్థితి నిశితంగా పర్యవేక్షించాలని అధికారులకు సూచించింది. బిహార్? సీఎం సమ్రాట్? చౌధరీతో కేంద్ర హోంమంత్రి అమిత్? షా మాట్లాడారు.

## చేనేత కార్మికులకు రుణాలు అందజేయాలి



**టీ మీడియా ఆగస్టు 26 ఆత్మకూరు:**
మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలో లో శ్రీమతి డీకే అరుణమ్మ ని కలిసి అమరచింత సంఘం లోని చేనేత కార్మికుల సమస్యలను వివరించారు.చేనేత భవన నిర్మాణం,జియో ట్యాగ్ తో సంబంధం లేకుండా 50ఏళ్ళు పైబడిన కార్మికులకు అందరికీ పెన్షన్స్ ఇవ్వాలని ,చేనేత రుణాల విషయంలో జరుగుతున్న ఇబ్బందులు, గుంత మగ్గాల స్థానంలో ఫ్రేమ్ మగ్గాలు సబ్సిడీలో ఇప్పించమని, కోరారు. ఎంపీ డీకే అరుణ స్పందిస్తూ సానుకూలంగా స్పందించి అతి త్వరలో సమస్యలన్నీ తీరుస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా మాతోపాటు వచ్చిన మాజీ అధ్యక్షులు చంద్రమోహన్ కి, రాష్ట్ర నాయకులు పగడాకుల శ్రీనివాస్ కి, బంగ్లా లక్ష్మీకాంత రెడ్డి కి, సంఘం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని మరింత చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు తిరుమల రఘు అన్నారు.

## ఆధార్ సేవా కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి తుమ్మల



**టీ మీడియా ఆగస్టు 26 ఖమ్మం :**
ఖమ్మం నగర ప్రజలకు ఆధార్ సేవలను మరింత వేగవంతంగా, సులభతరంగా అందించేందుకు నూతన ఆధార్ సేవా కేంద్రాన్ని (దీూా ఇంటర్నేషనల్) రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, కో–ఆపరేటివ్, చేనేత మరియు టెక్స్‌టైల్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఘనంగా ప్రారంభించారు. ఖమ్మం కవిరాజ్ నగర్‌లోని మమత హాస్పిటల్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, అధికారులు పునుకొల్లు నీరజ -- ఖమ్మం నగర మేయర్,దివాకర టి.ఎస్, ఐఏఎస్ -- ఖమ్మం జిల్లా కలెక్టర్,కె.ఎం. భారతి -- డైరెక్టర్, యూఐడీఏఐ రీజనల్ ఆఫీస్ (హైదరాబాద్),సారిపుడి రమాదేవి -- 11వ వార్డు కార్పొరేటర్, ఖమ్మం,సురేష్ కుమార్ -- ఆపరేషనల్ మేనేజర్ ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజలు కొత్త ఆధార్ నమోదు, వివరాల మార్పులు, బయోమెట్రిక్ అప్‌డేట్స్ వంటి అన్ని రకాల సేవల కోసం ఇకపై సులభంగా ఎలాంటి నిరీక్షణ లేకుండా ఈ కేంద్రాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నాణ్యమైన సేవలు అందించాలని ఆపరేషనల్ మేనేజర్ సురేష్ కుమార్ సిబ్బందికి సూచించారు.

## వివాహా వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మెన్



**టీ మీడియా, ఆగస్టు 26 పెబ్బేరు:**
వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు స్థానిక సహారా కళ్యాణ మండపంలో జరిగిన కటిక నారాయణ పాండు అక్క కూతురు పూజిత హేమంత్ కుమార్ ల వివాహ వేడుకకు ఆయన విచ్చేసి నూతన దంపతులను అక్షతలు వేసి శుభాకాంక్షలు తెలిపారు అనంతరం సాయిరాం కళ్యాణ మండపంలో జరిగిన ఎదవల్లి గోవర్ధన్ లక్ష్మీ దంపతుల కుమార్తె సాయి ప్రియ మహేష్ ల వివాహ మహోత్సవంలో పాల్గొని వధూవరులకు అక్షతలు వేసి ఆశీర్వదించారు ఈ కార్యక్రమాల్లో కౌన్సిలర్లు శివసాయి తాటికొండ కృష్ణ నాయకులు సత్యనారాయణ కటిక శ్రీనివాస్ వినయ్ లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు

## ఓ యస్ డి ముందు లొంగి పోయినమావోయిస్టులు



**టీ.మీడియా,ఆగస్టు26,చింతూరు:**
పోలవరంజిల్లా చింతూరులో సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ ఆపరేషన్ పంకజ్ కుమార్ మీనా ఎదుట ముగ్గురు మావోయిస్టులు బుధవారం లొంగిపోయారు. లొంగిపోయిన మావోయిస్టుల వివరాలను మీడియా సమావేశంలో పంకజ్ కుమార్ మీనా వెల్లడించారు. ముచ్చకి మంగి,కడితి లక్ష్మయ్య, కడితి ఎంక అను మావోయిస్టులు మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలకు విసిగిపోయి లొంగిపోయినట్లు ఆయన తెలిపారు.ముచ్చకి మంగి మావోయిస్టు పార్టీ ప్లాటూను కమిటీ సభ్యురాలుగా పనిచేస్తుందని అన్నారు. అలాగే పలు విధ్వంసకర ఘటనలలో పాల్గొన్నట్లు తెలిపారు. కడితి లక్ష్మయ్య, కడితి ఎంక లు మావోయిస్టు పార్టీలో పలు హింసాత్మాక ఘటనలలో పాల్గొన్నారని పేర్కొన్నారు.లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం తర అన్ని విధాల ఆదుకుంటామని ఆయన తెలిపారు. ఇంకెవరైనా మావోయిస్టులు ఉంటే జనజీవన స్రవంతిలో కలవాలని పంకజ్ కుమార్ మీనా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ 42 బెటాలిం ఇంచార్జ్ ఏకే దీప, సిఐ గోపాలకృష్ణ, ఎస్ఐ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

## విద్య వనరుల కేంద్రం నాసిరకం కట్టడంపై నిలదీత



**టీ మీడియా ,ఆగస్టు 26 ,ఆళ్లపల్లి :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండల కేంద్రంలో కొత్తగా నిర్మించిన మండల విద్య వనరుల కేంద్రం భవనం నాణ్యతా లోపాలకు నిలయంగా మారింది. నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న లేదా కట్టిన కొద్ది రోజులకే గోడలకు పెద్ద ఎత్తున పగుళ్లు రావడం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.ప్రజాధనంతో చేపట్టిన ఈ నిర్మాణంలో కాంట్రాక్టర్లు, అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. నాసిరకం సిమెంట్, తక్కువ క్వాలిటీ మెటీరియల్ ఉపయోగించడం వల్లే భవనం గోడలు ఇలా దెబ్బతిన్నాయని స్థానికులు మండిపడుతున్నారు. గ్రామస్తుల ఆరోపణలునిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా తక్కువ ధర సిమెంట్, ఇసుక మిశ్రమం వాడటం.ప్రారంభానికి ముందే పగుళ్లు ఏర్పడటంతో భవిష్యత్తులో అధికారులు, ఉపాధ్యాయులు ఇక్కడ పనిచేయడానికి భయపడే పరిస్థితి నెలకొంది.సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పనులను సరిగ్గా పర్యవేక్షించకపోవడం వల్లనే కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు.కొద్ది రోజులకే గోడలు ఊడిపోయేలా పగుళ్లు బారాయి. అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది
న్ని పట్టించుకోండి
అని స్థానిక గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. నాసిరకం పనులు చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని, భవనానికి తగిన మరమ్మతులు లేదా పునర్నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతున్నారు.

# తప్పు మీద తప్పు.. తప్పని వేటు



**⏭ జిల్లా ఈఎస్ అటాచ్‌మెంట్..**

**⏭ సీఐ సస్పెన్షన్**

**టి మీడియా, ఆగస్టు 26,భద్రాద్రి కొత్తగూడెం :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆబ్కారీ శాఖ అదుపుతప్పింది. స్మగ్లింగ్ కేసులో ఏకంగా న్యాయస్థానాన్ని, సొంత శాఖ తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసింది. ఫలితంగా తప్పు చేసిన ఇద్దరు అధికారులపై వేటుపడింది.! తప్పు కప్పిపుచ్చుకునేందుకు మరో తప్పు చేసి ఎక్సైజ్ సీఐ అడ్డంగా బుక్కవ్వగా.. అతన్ని కాపాడేందుకు ప్రయత్నించి సూపరింటెండెంట్ అటాచ్‌మెంట్ వేటుకు గురయ్యారు.వివరాల్లోకి వెళ్తే.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మూడు వారాల క్రితం గంజాయి రవాణా చేస్తున్న ఒడిశాకు చెందిన ఇద్దరు వ్యక్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి పట్టుకున్నారు. నిందితులకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పంచనామా నిర్వహించి భద్రాచలం అబ్కారీ అధికారులకు అప్పగించారు. అదే రోజు నిందితులను కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించాల్సి ఉంది. కానీ ఈ విషయంలో అక్కడి ఎక్సైజ్ సీఐ నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఇద్దరు నిందితులకు ఒక కానిస్టేబుల్‌ను ఎస్కార్ట్‌గా పెట్టి స్టేషన్‌లోనే ఒకరోజు ఉంచారు. ఇదే అదునుగా భావించిన ఇద్దరిలో ఒక నిందితుడు స్టేషన్ నుంచి సిబ్బంది కళ్లుగప్పి తప్పించుకుని పారిపోయాడు.నిందితుడి పరారీతో కంగారుపడిపోయిన ఎక్సైజ్ సీఐ ఈ విషయాన్ని.. ఎక్సైజ్ సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఇచ్చిన పంచనామాను మార్చి ఇద్దరు నిందితులను కాకుండా ఒకరినే పట్టుకున్నట్లుగా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలుస్తోంది. ఈ విషయం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దృష్టికి రావడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై రెండు వారాలపాటు విచారణ జరిపిన ఉన్నతాధికారులు భద్రాచలం ఎక్సైజ్ సీఐపై సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలిసింది. అంతేకాకుండా సీఐకి సహకరించిన సూపరింటెండెంట్‌పై అటాచ్‌మెంట్ వేటు వేశారని సమాచారం.ప్రస్తుతం జిల్లా అబ్కారీ అధికారి స్థానంలో గతంలో ఇక్కడ పనిచేసి ఖమ్మం జిల్లాకు బదిలీపై వెళ్లిన జానయ్యకు భద్రాద్రి కొత్తగూడెం ఇంచార్జి ఈఎస్‌గా బాధ్యతలు అప్పగిస్తూ అబ్కారీ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.ఇదిలా ఉండగా జిల్లా ఆబ్కారి శాఖలో పలుచోట్ల అవినీతి రాజ్యమేలుతున్నట్లుగా తెలుస్తోంది. గతంలో ఎంతోమంది అధికారులపై అవినీతి ఆరోపణలు వచ్చినప్పటికీ చర్యలు శూన్యం. ఇక జిల్లా ఆబ్కారి అధికారి కార్యాలయానికి నిత్యం ఎంతోమంది బాధితులు తమ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బెల్ట్ షాపుల వల్ల ఎదురవుతున్న ఇబ్బందుల గురించి ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు లేకపోవడం గమనార్హం. అదేవిధంగా కొన్ని కేసులలో పట్టుబడిన సీజ్డ్ ప్రాపర్టీలను సైతం కొందరు ఆ శాఖకు చెందిన వారే తప్పుదోవ పట్టించినట్లుగా విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం భద్రాచలంలో ఎదురైన ఘటన వెలుగులోకి రావడంతో ఈ విషయం బహిర్గతం అయింది. ఆ శాఖలో ఇలాంటి సంఘటనలు కోకోల్లలుగా జరిగినట్లుగా పుకార్లు జరుగుతున్నాయి. ప్రస్తుతం జరిగిన ఈ ఘటన సంబంధిత అధికారులను వేటుకు గురి చేసింది.

# బతికి ఉన్న తల్లిని బావిలో పడేసిన కుమారులు



**● ఆత్మహత్య చేసుకుందని నమ్మించే యత్నం**

**టి మీడియా, ఆగస్టు 26, హైదరాబాద్ బ్యూరో :**
ఏడుపదుల వయసు పైగా పక్షవాతంతో మంచం మీద నుంచి కనీసం లేవలేని దుస్థితి. మరి అలాంటి వృద్ధురాలు తనకు తానుగా ఇంటి నుంచి 300 మీటర్ల దూరంలో ఉన్న బావిలో దూకి ఆత్మహత్య ఎలా చేసుకుంటుంది. ఒకవేళ ఏ అర్థరాత్రో పాకుతూ వెళ్లిందనుకుందాం. అతికష్టం దూకినా సరిగ్గా నీళ్లల్లో పడే అవకాశం లేదు. పొలంలో ఉండే బావిలో ఒడ్డునే పడటం ఖాయం కానీ ఎవరో తీసుకెళ్లి బావి మధ్యలో పడేసినట్లుగా ఎలా దూకగలిగింది. అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుందని జనాలను నమ్మించడానికి కట్టుకథ అల్లారని చూసిన వారెవ్వరికైనా ఇట్టే అర్థమవుతుంది. ఇక ఈ కథకు స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వహించింది ఎవరో తెలిస్తే మాత్రం నోరు వెళ్లబెట్టాల్సిందే.

అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు : కరీంనగర్ జిల్లా ఎలబోతారంలో ఈ ఏడాది ఏప్రిల్ 6న పక్షవాతంతో మంచానపడిన వృద్ధురాలు నూనె వెంకటమ్మ కనిపించకుండాపోయింది. ఆమె జాడ కోసం నలుగురు కొడుకులు గ్రామం మొత్తం వెతికారు. అయితే ఇంటికి దగ్గరలోనే ఉన్న ఓ వ్యవసాయ బావిలో ఆమె పడిపోయి ఉంటుందని భావించి నీళ్లన్నీ తోడి చూశారు. కానీ ఎక్కడా ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. మరుసటిరోజు చిన్న కొడుకు శ్రీనివాస్ 300 మీటర్ల దూరంలో ఉన్న మరో వ్యవసాయ బావిలో పడి ఉంటుందేమోనని అనుమానం వ్యక్తం చేస్తూ అందరినీ తీసుకుని వెళ్లి చూడగా అందులో ఆమె మృతదేహం లభ్యమైంది. పక్షవాతంతో అనారోగ్యానికి గురై ఆత్మహత్య చేసుకుని ఉంటుందని అందరూ నమ్మారు. కానీ రెండో కుమారుడికి మాత్రం తల్లి ఆత్మహత్యపై అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బావిలో పడేసిన కుమారులు : పక్షవాతంతో మంచంమీద నుంచి లేవలేని స్థితిలో ఉన్న వృద్ధురాలు ఇంటికి 300 మీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయ బావి వద్దకు ఎలా వెళ్లిందని పోలీసులకు కూడా అనుమానం వచ్చింది. అక్కడికి వెళ్లే దారి కూడా దట్టమైన పొదలతో నిండి ఉంది. పైగా ఆ బావి ఒడ్డు నుంచి దూకినా నేరుగా నీళ్లలో పడే పరిస్థితి లేదు. గ్రామంలో విచారించగా కుమారులపైనే అనుమానాలు వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు తమదైన శైలిలో విచారణ చేయగా అసలు విషయం బయటపడింది. కన్నతల్లిని కుమారులే తీసుకెళ్లి బతికి ఉండగానే బావిలో పడేశారని తేలింది.

చిన్న కుమారుడి పథకం : వెంకటమ్మకు నలుగురు కుమారులు కాగా వంతులు వారీగా ఆమె బాగోగులు చూసుకుంటున్నారు. అయితే ఆమె చనిపోవడానికి పది రోజులు ముందే పక్షవాతానికి గురైంది. మంచం మీద నుంచి లేవలేని పరిస్థితి ఎదురైంది. ఎక్కువకాలం బతికే అవకాశం లేదని తెలిసిపోయింది. అయితే ఎవరి వంతు ఉన్నప్పుడు తల్లి చనిపోతే వాళ్లు శాస్త్ర ప్రకారం ఇల్లు వదిలి వెళ్లిపోవాల్సి వస్తుందన్న మూఢనమ్మకంతో ఆమె ఇంట్లో చనిపోకుండా బయటే ప్రాణాలు విడిచేలా చిన్న కుమారుడు పథకం వేశాడు. ఈ విషయం పెద్దన్నయ్యకు చెప్పగా అతను కూడా సరేనన్నాడు. దీంతో చిన్న కుమారులు తల్లిని ఎత్తుకుని రాగా పెద్ద కుమారుడు ఎవరూ చూడకుండా దారికాచాడు. రాత్రివేళ ఎవ్వరికీ తెలియకుండా తీసుకెళ్లి బతికి ఉన్న తల్లిని బావిలో పడేసి చేతులు దులుపుకున్నారు. ఆ తర్వాత ఏం తెలియనట్లు తల్లి కనిపించడం లేదని నాటకమాడారు.

"80 సంవత్సరాల వృద్ధురాలు నడవలేని పరిస్థితిలో 300 మీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయ బావిలో దూకి ఎలా ఆత్మహత్య చేసుకుంటుందనే అనే అనుమానాలు వచ్చాయి. విచారణలో భాగంగా వృద్ధురాలి పెద్ద, చిన్న కుమారులు ఇద్దరూ కలిసి హత్య చేసినట్లు తేలింది" – శ్రీనివాస్, హుజూరాబాద్ రూరల్ సీఐ

అరెస్టు చేసిన పోలీసులు : రెండో కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు హత్యకేసును ఛేధించారు. పెద్దకుమారుడు సమ్మయ్యతో పాటు చిన్నకుమారుడు శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

# 31న వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభం



**టీమీడియా, అమరావతి**
వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కాలువ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ ప్రతిష్టాత్మక పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును (ఫేజ్?–1) 2026 ఆగస్టు 31న ప్రారంభించేందుకు సర్వం సిద్ధం చేసింది. ముఖ్యంగా ప్రాజెక్టుకు అత్యంత కీలకమైన ఫీడర్ కాలువ పనులు ప్రస్తుతం తుది దశకు చేరుకుని, యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయి.

జోరుగా సాగుతున్న ఫీడర్? కాలువ పనులు : ఈ నెల 31న సీఎం చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించనుండటంతో తుది దశ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దోర్నాల మండలం గంటవానిపల్లె చెరువు సమీపంలోని ఫీడర్ కాలువ క్రాస్ రెగ్యులేటర్ వద్ద చంద్రబాబు కృష్ణా జలాలకు జలహారతి, క్రాస్ రెగ్యులేటర్ గేట్లను ఎత్తి నీరు వదలనున్నారు. అందుకోసం రెగ్యులేటర్లకు నాలుగు గేట్లను బిగించారు. వాటిని ఆపరేటింగ్ చేసే సిస్టంను బిగించే పని చేస్తున్నారు. కృష్ణా జలాలకు జలహారతి ఇచ్చేందుకు కాలువలో మెట్లను నిర్మాణ కోసం పొక్లెయిన్‌లతో గుంతలు తీస్తున్నారు. ఆ కాలువ పక్కన ఉన్న మట్టిని టిప్పర్లతో వేరే ప్రాంతానికి తరలిస్తున్నారు. మరో రెండు రోజుల్లో వాటిని పూర్తి చేసే పనిలో కార్మికులు నిమగ్నమయ్యారు.

పనులను పరిశీలించిన మంత్రి : పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్న సందర్భంగా అక్కడ జరుగుతున్న తుది దశ పనులను మంత్రి నిమ్మల రామానాయుడు పరిశీలించారు. జరుగుతున్న పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ట్రాక్టర్లతో భారీ ర్యాలీ : ప్రతిష్టాత్మక వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం, నీటి విడుదలను పురస్కరించుకుని, మార్కాపురం ప్రాంతంలో రైతులు, కూటమి నాయకులు భారీ ట్రాక్టర్ ర్యాలీని నిర్వహించారు. వందలాది అలంకరించిన ట్రాక్టర్లతో కూడిన ఈ భారీ ర్యాలీ బెస్తవారిపేట వై–జంక్షన్ వద్ద ప్రారంభమై కుంభం గచ్చుకాలువ వద్ద ముగిసింది. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ ఈ ర్యాలీకి నాయకత్వం వహించి, రైతులతో కలిసి ఉత్సాహంగా పాల్గొనడంతో పశ్చిమ ప్రకాశం ప్రాంతమంతా పండుగ వాతావరణం నెలకొంది. ర్యాలీ కార్యక్రమంలో కూటమి భాగస్వాములైన తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు, నియోజకవర్గ ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ, "పశ్చిమ ప్రకాశం, మార్కాపురం జిల్లా ప్రజల, రైతాంగపు దశాబ్దాల నాటి కల నెరవేరుతున్న చారిత్రాత్మక ఘట్టం ఆసన్నమైంది. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ద్వారా నీటిని విడుదల చేసేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సమర్థవంతమైన నాయకత్వంలో వెలిగొండ ప్రాజెక్టు పనులను ఎన్నడూ లేని విధంగా వేగవంతం చేశారు. నాడు ఇదే వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన చంద్రబాబు, మళ్లీ ఈ ప్రాజెక్టును పూర్తి చేసి ఈనెల 31వ తేదీన వెలిగొండ జలాలను జాతికి అంకితం చేస్తూ విడుదల చేయనుండటం ఎంతో శుభపరిణామం. ప్రాజెక్టు నిర్మాణంతో పాటు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న వెలిగొండ నిర్వాసితుల కష్టాలను గుర్తించి, వారికి తగిన నష్టపరిహారాన్ని అందజేసి ఆదుకున్న ఘనత కూడా కూటమి ప్రభుత్వానికే దక్కుతుంది" అని తెలిపారు.

# గల్లంతైన ఏడుగురు మత్స్యకారులు క్షేమం



**టీమీడియా, అమరావతి**
సముద్రంలో చేపల వేటకు వెళ్లి ఆచూకీ లేకుండా పోయిన కోనసీమ జిల్లాకు చెందిన ఏడుగురు మత్స్యకారుల కథ సుఖాంతమైంది. కోల్‌కతా తీరంలో వారు సురక్షితంగా ఉన్నారని మత్స్యశాఖ అధికారులు తెలిపారు. అల్లవరం మండలం ఓడలరేవుకు చెందిన ఏడుగురు మత్స్యకారులు ఈనెల 3వ తేదీన సముద్రంలో చేపల వేటకు వెళ్లి గల్లంతయ్యారు.

దీంతో ఈనెల 17 నుంచి 10 రోజుల పాటు నేవీ, కోస్ట్‌గార్డ్, మెరైన్ సిబ్బంది విస్తృతంగా గాలింపు చేపట్టారు. ఓడలరేవు జెట్టీ నుంచి వెళ్లిన బోటులో గేర్? బాక్స్? దెబ్బతినడంతో 20 రోజులకు పైగా సముద్రంలో ఉన్నారు. మరో బోటు కనిపించడంతో వారి ఫోన్ నుంచి మత్స్యకారులు సమాచారం ఇచ్చారు. సముద్రంలో నుంచి బెంగాల్ తీరంలోని జిగా ప్రాంతానికి మత్స్యకారుల బోటు చేరుకుంది. మత్స్యకారులను త్వరలోనే వారి ప్రాంతాలకు తీసుకు వస్తామని మత్స్యశాఖ జేడీ కరుణాకర్ తెలిపారు. దాదాపు 23 రోజుల తర్వాత మత్స్యకారులు సురక్షితమని సమాచారం రావడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మత్స్యకారులను స్వగ్రామాలకు తీసుకొస్తున్నట్లు మత్స్యశాఖ సహాయ సంచాలకుడు రమణారావు పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితిని అమలాపురం ఎంపీ హరీశ్, ఎమ్మెల్యే ఆనందరావు పర్యవేక్షిస్తున్నారు. గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేసింది. ఈ నెల 17 నుంచి సముద్రంలో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టింది. నేవీ, కోస్ట్ గార్డ్, మెరైన్ సిబ్బంది 10 రోజుల పాటు గాలించారు. ఎట్టకేలకు వారంతా బెంగాల్ తీరంలో క్షేమంగా ఉన్నారని శుభవార్త వచ్చింది.

మత్స్యకారుల భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యం: కోనసీమ జిల్లాకు చెందిన ఏడుగురు మత్స్యకారులు పశ్చిమ బెంగాల్‌లో సురక్షితంగా ఉన్నారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ నెల 3న ఓడలరేవు నుంచి సముద్ర వేటకు వెళ్లిన మత్స్యకారులు, బోటులో సాంకేతిక సమస్య తలెత్తడంతో బెంగాల్ తీరానికి చేరుకున్నారు. బోటు యజమాని సోదరుడు భవానీ ప్రసాద్‌తో మాట్లాడి మత్స్యకారులు క్షేమంగా ఉన్నట్లు అధికారులు నిర్ధారించారని తెలిపారు. మత్స్యకారుల ఆచూకీ కోసం సమన్వయంతో పని చేసిన జిల్లా కలెక్టర్, మత్స్యశాఖ కమిషనర్, జేడీ, ఎఫ్‌డీవో అధికారులను మంత్రి అభినందించారు. మత్స్యకారులను స్వస్థలాలకు తీసుకురావడానికి చర్యలు చేపట్టాలని, అవసరమైతే అధికారులను పశ్చిమ బంగాకు పంపాలని ఆదేశించారు. మత్స్యకారుల భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, వారి కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

అసలేం జరిగిందంటే?: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు తీరం నుంచి ఏడుగురు మత్స్యకారులు ఈ నెల 3న సముద్రంలో వేటకు వెళ్లారు. వేటకు వెళ్లిన మత్స్యకారులు గంట తర్వాత నుంచి స్థానికులకు అందుబాటులోకి రాలేదు. వేట ముగించుకుని 10 రోజుల్లో రావాల్సిన వారు తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు మెరైన్ పోలీసులు, మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. గల్లంతైన మత్స్యకారుల కోసం దాదాపు 10 రోజులు గాలింపు చర్యలు చేపట్టారు. తాజాగా ఏడుగురు మత్స్యకారులు బెంగాల్?లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. మత్స్యకారులంతా సురక్షితంగా ఉన్నారని వెల్లడించారు. బోటులో సాంకేతిక సమస్య ఏర్పడడంతో బెంగాల్ తీరానికి చేరినట్లు పేర్కొన్నారు.




# రైలు ప్రయాణికులకు గుడ్‌న్యూస్

**● ఈ రద్దీ రూట్లలో 11 వేల కిలోమీటర్ల మేర 'ఫోర్ ట్రాక్' లైన్లు**

**● కేంద్రం మాస్టర్ ప్లాన్!**

**టీమీడియా, న్యూఢిల్లీ :**
దేశంలోని 7 ప్రధాన రైల్వే మార్గాలను ఫోర్–ట్రాక్‌గా (నాలుగు లైన్లు) విస్తరిస్తున్నట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం ప్రకటించారు. దాదాపు 11 వేల కిలోమీటర్ల మేర రైల్వే నెట్‌వర్క్‌ను నాలుగు లైన్లుగా విస్తరించే పనులు చేపడుతున్నట్లు వివరించారు. ఈ భారీ ప్రాజెక్టుతో ప్రయాణికుల రద్దీ తగ్గుతుందని భావిస్తున్నారు. సరకు రవాణా సామర్థ్యాన్ని గణనీయంగా పెంచడం, వేగవంతం చేయడం కూడా ఈ భారతీయ రైల్వే ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ఉద్దేశంగా చెబుతున్నారు. ఈ 7 హై డెన్సిటీ మార్గాలు మొత్తం రైల్వే నెట్‌వర్క్‌లో కేవలం 16 శాతంగానే ఉన్నప్పటికీ, దేశవ్యాప్తంగా జరుగుతున్న మొత్తం రైల్వే ట్రాఫిక్‌లో ఈ మార్గాల వాటానే సుమారు 41 శాతంగా ఉందని అశ్విని వైష్ణవ్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా తెలిపారు. దీంతో ఈ మార్గాల్లో సామర్థ్యాన్ని పెంచడం భారతీయ రైల్వేలకు అత్యంత కీలకంగా మారింది. అందుకే వీటిని ప్రాధాన్యత క్రమంలో విస్తరిస్తున్నట్లు, ఈ రద్దీ ఎక్కువగా ఉండే 7 కీలక రైలు మార్గాల అభివృద్ధిపై కేంద్రం ప్రధానంగా దృష్టి సారించినట్లు వెల్లడించారు. ఈ రద్దీ రూట్లలో ఢిల్లీ– హౌవ్?డా, ముంబయి– ఢిల్లీ, హౌవ్?డా– చెన్నై వంటి కీలక నగరాలు ఉన్నాయి.

7 హై డెన్సిటీ రైల్వే రూట్లు ఇవే
దేశంలోని ప్రధాన నగరాలు, ప్రాంతాల్ని అనుసంధానించే ఈ 7 కారిడార్లలో ట్రాక్స్ విస్తరణ వేగంగా జరగనుంది. ఆ 7 ప్రధాన రూట్లు ఇవే!

- ఢిల్లీ– హౌవ్?డా
- హౌవ్?డా– చెన్నై
- చెన్నై– ముంబయి
- ముంబయి– ఢిల్లీ
- ఢిల్లీ– చెన్నై
- ముంబయి– హౌవ్?డా
- ఢిల్లీ– గువాహటి

ఈ మార్గాలు దేశంలోని ప్రధాన ఆర్థిక కేంద్రాలు, నగరాలు, పారిశ్రామిక ప్రాంతాల్ని అనుసంధానిస్తున్నాయి. దీంతో వీటిపై ప్రయాణికుల రైళ్లతో పాటు సరుకు రవాణా రైళ్ల ట్రాఫిక్ కూడా అధికంగా ఉంటుంది. ఇక ఈ ప్రధాన రైల్వే మార్గాల్లో అదనపు ట్రాక్స్ అందుబాటులోకి వస్తే రైళ్లను మరింత సౌకర్యవంతంగా నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. ఇప్పటికే ఉన్న ట్రాక్స్‌పై ఒత్తిడి తగ్గడంతో పాటు, ప్రయాణికులు అలాగే సరుకు రవాణా రైళ్లను మరింత సమర్థవంతంగా నడిపించేందుకు వీలు కలుగుతుందని పేర్కొన్నారు. రైలు ప్రయాణాలకు రోజురోజుకూ పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు, వచ్చినా ఎదుర్కొనేందుకు ఈ విస్తరణ ఉపయోగపడుతుందని రైల్వే శాఖ భావిస్తోంది.